


సాక్షి
నిజామాబాద్
మహిళా దినోత్సవం
శనివారం । 8 । మార్చి । 2025







మీ ఇంట్లో ఆడ-మగ వివక్ష ఏమైనా ఉందా?




మీ కాలేజ్, పని ప్రదేశంలో మహిళగా ఏమైనా వివక్ష ఎదుర్కొంటున్నారా?

అయినా వివక్ష !

- ఇంటి నుంచే మొదలు..
- బస్టాపులు, కాలేజీలు, పని ప్రదేశాల్లో ఇబ్బందులు
- 'సాక్షి' సర్వేలో వ్యక్తమైన మనోభిప్రాయాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నేటి మహిళలు అన్ని రంగాల్లో అద్భుతాలు సాధిస్తున్నారు. గృహిణిగా ఇంటిని చక్కదిద్దుతూనే.. వర్కింగ్ ఉమెన్‌గా పోలీసు, అటవీ శాఖ తదితర చాలెంజింగ్ ఉద్యోగాలతో పాటు విద్య, వైద్య, న్యాయ తదితర వ్యవస్థల్లో తమ ప్రత్యేకత చాటుతున్నారు. అయినా వారి పట్ల వివక్ష ఎదురవుతూనే ఉంది. బేటీ బచావో-బేటీ పఢావో నినాదంతో ప్రభుత్వాలు ముందుకెళుతూ అనేక మహిళా సాధికారత కార్యక్రమాలు, మహిళా చట్టాలను అమలు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో వివక్ష పోలేదని పలువురు మహిళలు చెబుతున్నారు. బస్టాపులు, కాలేజీలు, పని ప్రదేశాల్లో ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మహిళా దినోత్సవం నేపథ్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే ఫలితాలు ఇలా ఉన్నాయి.



మీరు ఎక్కువగా ఇబ్బంది పడుతున్న ప్రదేశం?



మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న వారిలో అత్యధికం ఎవరు?

గెస్ట్ ఎడిటర్‌గా జిల్లా జడ్జి

- రిపోర్టర్ల కథనాలను ప్రాధాన్యత మేరకు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది
- ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతినిచ్చింది
- పాత్రికేయ వృత్తిలో ఉన్న కష్టం పూర్తిస్థాయిలో తెలిసింది
- వార్తల సేకరణ నుంచి పత్రిక పాఠకులకు చేరవేసే వరకు పడే కష్టం గొప్పది
- జిల్లా జడ్జి సునీత కుంచాల

నిజామాబాద్ 'సాక్షి' ఎడిషన్ కేంద్రంలో శుక్రవారం జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల 'గెస్ట్ ఎడిటర్'గా వ్యవహరించారు. జిల్లాలోని రిపోర్టర్లు రాసిన కథనాలను, వార్తలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి డెస్క్ బృందానికి ఇచ్చారు. అదేవిధంగా పలు రకాల సూచనలు చేశారు. 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా రావడం చాలా సంతోషం కలిగించిందన్నారు. పాఠకులకు కేవలం రూ.5 లకు ఇచ్చే పత్రికను బయటకు తీసుకొచ్చేందుకు ఎంత కష్టముంటుందో ప్రత్యక్షంగా చూడడం కొత్త అనుభవాన్నిచ్చిందన్నారు. వార్తల సేకరణ మొదలు పత్రిక పాఠకుడికి చేరేవరకు ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ అనేకమంది పడుతున్న శ్రమ సాధారణమైనది కాదన్నారు. ఎప్పటికీ మరిచిపోలేని అనుభవాన్ని పొందానన్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



మహిళ శక్తి అనంతం

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సునీత కుంచాల మాట్లాడారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. ప్రతి మహిళలోనూ ఓపికతో పాటు శక్తి ఎంతో ఉంటుందన్నారు. శక్తిని సమయాన్ని, సందర్భాన్ని బట్టి ఉపయోగిస్తే అద్భుత ఫలితాలను సాధించొచ్చన్నారు. వర్కింగ్ ఉమెన్స్ చాలెంజింగ్‌గా ముందుకు వెళ్లాలన్నారు. గృహిణులను ఏమాత్రం తక్కువ చేసి చూడొద్దన్నారు. గృహిణులు చేసే కష్టంతోనే భావి పౌరుల జీవితాలు వికసిస్తున్నాయన్నారు. గృహిణుల కష్టాన్ని పురుషులు తరచూ చేసే ప్రయత్నం చేస్తే విలువ తెలుస్తుందన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక మహిళ ఉన్నట్లే, ప్రతి మహిళ విజయం వెనుక పురుషుడు ఉంటే సమాజానికి ఎనలేని మేలు కలుగుతుందన్నారు. మహిళలకు తండ్రి, భర్త, కుమారుడు, స్నేహితుడు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ సహకరిస్తే ఏదైనా సాధిస్తారన్నారు.


సాక్షి ఎడిషన్ కార్యాలయంలో రిపోర్టర్లు పంపిన వార్తలను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

సవాళ్లు అధిగమించి..

'వివక్షను అధిగమిస్తూ విజయాలు సాధిస్తున్నారు.. అవహేళనలు, అవమానాలను సంకల్పమనే బాణాలతో ఛేదిస్తున్నారు.. ఇంట్లో బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు.' స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్న అతివలపై నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కరాటే క్వీన్ పల్లవి



బోధన్: 'చిన్నప్పటి నుంచే కరాటేపై ఆసక్తి. ఇంటర్ తర్వాత పెళ్లయ్యింది. పిల్లలు, ఉద్యోగం, బాధ్యతలు పెరిగాయి. అవేమీ తన సంకల్పానికి అడ్డుకాదని భావించింది. ఎన్ని అవమానాలు, అవహేళనలు ఎదురైనా ఓర్చుకొని కరాటే క్వీన్‌గా ఎదిగారు.' బోధన్ పట్టణానికి చెందిన మల్లెపూల పల్లవి. కరాటేతోపాటు కర్ర, కత్తిసాము, గుర్రపు స్వారీ, బాక్సింగ్ విద్యల్లో శిక్షణ పొంది పట్టు సాధించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ చాటింది. 2022లో మార్షల్‌ఆర్ట్స్ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి కరాటే స్పారింగ్(ఫైటింగ్) విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. కరాటేలో బ్రౌన్ బెల్ట్‌స్థాయిలో నిలిచింది. సామాన్య కుటుంబానికి చెందిన వివాహిత అయిన పల్లవి కరాటే మాస్టర్‌గా రాణిస్తూ అందరి మన్ననలు పొందుతోంది. ప్రస్తుతం మహిళలకు వ్యాయామ విద్య, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణనిస్తుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే లైసెన్స్ పొందిన ఏకైక మహిళా కరాటే మాస్టర్‌గా నిలిచింది. 'ఆపద సమయంలో ఎవరో వచ్చి రక్షిస్తారని ఆశించడం కన్నా ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవడం ఉత్తమం.' అని చెబుతున్నారు కరాటే టైగర్ మల్లెపూల పల్లవి.


అడవుల్లో ఎఫ్ఆర్వోతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మహిళా బీట్ ఆఫీసర్లు

అడవితల్లి రక్షణలో ఆడబిడ్డలు

- ప్రకృతితో కలిసి పనిచేస్తున్న మహిళా బీట్ ఆఫీసర్లు

డొంకేశ్వర్(ఆర్మూర్): మానవాళి మనుగడకు ప్రధానమైన అడవుల సంరక్షణకు ఆడబిడ్డలు ముందుకొస్తున్నారు. పనివేళలతో సంబంధం లేకుండా రాత్రింబవళ్లు సవాల్‌తో కూడుకున్న.. కత్తి మీద సాములాంటి విధులు నిర్వర్తిస్తున్నారు. కష్టమైన సరే అటవీ శాఖలో ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. పురుషులతో సమానంగా క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అడవులు, వన్యప్రాణుల రక్షణకు పాటు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 మంది మహిళా ఉద్యోగులు ఉండగా, అత్యధికంగా 16 మంది బీట్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లుగా ఇద్దరు, ఎఫ్ఆర్వోగా ఒకరు, సెక్షన్ ఆఫీసర్‌గా ఒకరు విధులు నిర్వరిస్తున్నారు.

ప్రకృతి అంటే ఇష్టం..



మాది వరంగల్ జిల్లా కాజీపేట్. 17 సంవత్సరాల క్రితం అటవీ శాఖలో టెక్నికల్ ఆఫీసర్‌గా చేరాను. వరంగల్‌తోపాటు కరీంగనర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనిచేశా. ఏడాది క్రితం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై నిజామాబాద్‌కు వచ్చాను. నాకు ప్రకృతి అంటే చాలా ఇష్టం. అందుకే అడవుల్లో పని చేసేందుకు ఇష్టపడతాను.

– కొలిపాక రాధిక, ఎఫ్ఆర్వో, నిజామాబాద్ సౌత్ రేంజ్

అవార్డు తీసుకోవడం సంతోషాన్నిచ్చింది



సొంతూరు నిజామాబాద్. 2012లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. అడవులు, వన్య ప్రాణులను కాపాడే విషయం లో ముందుంటాను. కమ్మర్‌పల్లిలో కబ్జా అవుతున్న అటవీ భూమిని కాపాడి అందులో మొక్కలు నాటించాను. అధికారులు అభినందించి నాకు అవార్డు ఇవ్వడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

– కె. మంజులత, బీట్ ఆఫీసర్, వర్ని రేంజ్

సమర్థవంతగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా..



మాది డిచ్‌పల్లి మండలం వెస్లీనగర్ తండా. 14 సంవత్సరాలుగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగం చేస్తున్నాను. అటవీ శాఖలో ఉద్యోగం అంటే కొంత సాహసమనే చెప్పాలి. అయినప్పటికీ కుటుంబ సభ్యులు ఇచ్చిన ధైర్యంతో బీట్ ఆఫీసర్ ఉద్యోగ విధుల్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నా.

– చౌహన్ విజయ భారతి, బీట్ ఆఫీసర్, నిజామాబాద్ సౌత్ రేంజ్

పేదరికాన్ని జయించి వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా..


డాక్టర్ పిట్ల సరిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ

నిజామాబాద్ సిటీ: పసిప్రాయంలోనే తండ్రి మరణం. నలుగురు తోబుట్టువులు. పూరి గుడిసెనే ఆస్తి. రాళ్లుకొడితేనే నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లే దుర్భర పరిస్థితి. మారుమూల గడ్కోల్ గ్రామం నుంచి జీవితం ప్రారంభించి వర్సిటీ విద్యార్థులకు ఉన్నత విద్య బోధించే స్థాయి వరకు ఎదిగారు డాక్టర్ పిట్ల సరిత. గురుకుల పాఠశాలలో సీటు సంపాదించుకొని పదో తరగతిలో 524 మార్కులు సాధించారు. ఇంటర్‌లో 92శాతం మార్కులు వచ్చి ఎంసెట్‌లో సీటువచ్చినా ఇంజినీరింగ్ చదివే స్తోమత లేక గిరిరాజ్ కళాశాలలో డిగ్రీలో చేరారు. తెలంగాణ వర్సిటీలో ఎంఏ, ఎమ్మెస్సీ రెండు పీజీలు చేశారు. పీహెచ్‌డీ చేసి డాక్టర్ సరిత అయ్యారు. చదివిన యూనివర్సిటీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. పీడీఎస్‌యూలో పనిచేసే సమయంలో ఉద్యమసహచరుడు ఎల్‌బీ రవిని కులాంతర ఆదర్శ వివాహం చేసుకున్నారు. మరోపక్క పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా, మానవ హక్కుల వేదిక జిల్లా ఉపాధ్యక్షురాలిగా పేదల గొంతుకై పోరాడుతూ తన జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న డాక్టర్ పిట్ల సరిత ఆదర్శప్రాయురాలు.

ఆమెపై ఆగని అకృత్యాలు

ఖలీల్‌వాడి: ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు అమలు చేసినా.. 'ఆమె'పై జరుగుతోన్న అకృత్యాలకు అడ్డుకట్ట పడడం లేదు. బాలికలు, మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రేమ పేరిట, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి బాలికలను మోసం చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో అత్యాచారం చేసినట్లు వెలుగుచూడడంతో పోక్సో కేసులుగా నమోదవుతున్నాయి. మరోచోట పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. నిందితులను జైలుకు పంపిస్తున్నా మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోన్న విషయం.

తల్లిదండ్రుల చేతుల్లోనే బాలికల భద్రత

గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే చాక్లెట్లు, మిఠాయిలు, తదితర బహుమతులను సున్నితంగా తిరస్కరించేలా తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలి. ఇంటి పరిసరాలు, పాఠశాలల్లో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తున్నారా? అని అడగాలి. పిల్లలను ఇంటి పక్కవారు, బంధువులతో సినిమాలు, షాపింగ్, పర్యాటక ప్రాంతాలకు పంపించొద్దు.

సమాచారమివ్వాలి

మహిళలు, బాలికలను ఎవరైనా ఇబ్బంది పెడితే కుటుంబీకులకు చెప్పాలి. అయినా వినకపోతే పోలీసులు, డయల్ 100, షీటీమ్స్‌ల దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. మారువేషంలో నిఘా పెట్టి ఆకతాయిల పనిపడతాం.

– స్రవంతి, ఎస్సై, షీటీం, నిజామాబాద్



కేసుల వివరాలు..

కేసులు	2022	2023	2024
అత్యాచారం	62	74	77
పోక్సో	80	81	115
మహిళలపై నేరం	581	608	593
షీటీమ్	05	01	04

స్ఫూర్తిదాయకం.. తెడ్డు సుమలత


మున్సిపల్ కార్యాలయం ఇన్‌వార్డులో పనిచేస్తున్న తెడ్డు సుమలత

ఆర్మూర్‌టౌన్ : 'కాళ్లు లేవు ఏం చేయగలదు' అని వెక్కిరించిన సమాజానికే సేవలందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది ఆర్మూర్‌కు చెందిన తెడ్డు సుమలత. చిన్న వయస్సులోనే పోలియో ప్రభావంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయినా, దాన్ని తన జీవిత ప్రయాణానికి అడ్డుగా చేసుకోలేదు. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగి డిగ్రీ (బీఏ) పూర్తిచేసింది. 15 సంవత్సరాలుగా పురపాలక కార్యాలయంలోని ఇన్‌వార్డ్ విభాగంలో సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. చేతుల సాయంతోనే నడుచుకుంటూ రోజువారీ పనులు చేసుకుంటూ స్వయంగా జీవిస్తున్నారు. తల్లిదండ్రులు ఇటీవల మరణించగా, ప్రస్తుతం సోదరుడి వద్ద ఉంటోంది. 'ఎవరూ మన సామర్థ్యాన్ని నిర్ణయించలేరు. శారీరక అడ్డంకులు మన లక్ష్యాలను ఆపలేవు. మన సంకల్పమే మార్గం చూపుతుంది' అని చెబుతోంది తెడ్డు సుమలత.

న్యూస్‌రీల్

సెంటర్లను తనిఖీ చేసిన ఇంటర్ బోర్డు అధికారులు

- రెండోరోజు 652 మంది గైర్హాజరు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షలను శుక్రవారం ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీ చేశారు. ధర్పల్లి, భీమ్‌గల్, మోర్తాడ్ మండలాల్లోని పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు పరీక్షల విభాగం డిప్యూటీ సెక్రెటరీలు యాదగిరి, ఖాదర్ షరీఫ్ పరిశీలించారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను నిక్షిప్తం చేసిన విధానంతోపాటు కస్టోడియన్ ప్రశ్నపత్రాల పంపిణీని ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ పరిశీలించారు. మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు జిల్లాలో మొత్తం 18,649 మంది విద్యార్థులకు 17,997 మంది హాజరుకాగా, 652 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 49 పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతోపాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్, హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లతోపాటు తాను తనిఖీ చేసినట్లు రవికుమార్ పేర్కొన్నారు.

అతివలకు అండగా మధ్యవర్తిత్వ కేంద్రం


బోధన్‌లోని మధ్యవర్తిత్వ కేంద్రంలో మహిళతో మాట్లాడుతున్న సభ్యులు (ఫైల్)



బోధన్‌లో మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల (ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఉచిత న్యాయసేవల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న సామూహిక మధ్యవర్తిత్వ కేంద్రాలు అతివలకు అండగా నిలుస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తొలిసారిగా బోధన్‌లో సామూహిక మధ్యవర్తిత్వ కేంద్రాన్ని గత సంవత్సరం ఆగస్టు 28న జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల ప్రారంభించారు. ఆ తర్వాత నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. మండల న్యాయసేవాధికార సంస్థ కొంతమంది తటస్థ వ్యక్తులను ఎంపిక చేసి వారికి కేంద్ర నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. బోధన్ మధ్యవర్తిత్వ కేంద్రంలో పద్మాసింగ్, సుజాత, రాజేందర్ సింగ్ సేవలందిస్తున్నారు. ఇక్కడి కేంద్రంలో ఇప్పటి వరకు 61 కేసులు నమోదు కాగా, అందులో 90 శాతానికి పైగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలే కావడం గమనార్హం. వరకట్న వేధింపులు, భార్యాభర్తల మధ్య తగాదాలు, వృద్ధ మహిళల పెన్షన్ కేసులు, అత్తాకోడళ్ల మధ్య మనస్పర్థలు తదితర సమస్యలున్నాయి.

మధ్యవర్తిత్వ కేంద్రం ప్రయోజనాలివే..

తగాదా పడే వ్యక్తులు నిష్పక్షపాత, తటస్థ మధ్యవర్తి ద్వారా ఐచ్ఛికంగా సహకరించుకొని వివాదాలు పరిష్కరించుకునే అవకాశం ఏర్పడింది. ఈ కేంద్రాల్లో సామరస్య పూర్వకంగా సమస్యలను పరిష్కరిస్తారు. ఉచిత న్యాయ సలహాలు అందిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా సమయం, డబ్బు వృథా కాదు. సమస్య సులభతరంగా పరిష్కారమవుతుంది. దీంతో బాధిత మహిళలు ఎక్కువ సంఖ్యలో ఈ కేంద్రాన్ని ఆశ్రయిస్తూ ప్రయోజనం పొందుతున్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి

ఆధునిక ప్రపంచంలోనూ మహిళలపై వేధింపులు జరగడం బాధాకరం. మహిళలు పోలీస్‌స్టేషన్ల వరకు వెళ్లే పనిలేకుండా, వారి సమస్యను ఇక్కడే పరిష్కరించేలా ఈ కేంద్రం ముందుకు సాగుతోంది.

– పద్మాసింగ్, మధ్యవర్తిత్వ సెంటర్ సభ్యురాలు

సీపీగా పోతరాజు సాయిచైతన్య

- నాలుగు నెలల తర్వాత కొత్వాల్ నియామకం
- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ బదిలీ
- కామారెడ్డి ఎస్పీగా రాజేశ్‌చంద్ర



సీపీ సాయిచైతన్య, కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పోతరాజు సాయిచైతన్యను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న సాయిచైతన్య బదిలీపై వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బదిలీపై నిజామాబాద్ సీపీగా వచ్చిన కల్మేశ్వర్ సింగేనవార్ గతేడాది అక్టోబర్ 23న కేంద్ర సర్వీసులకు వెళ్లారు. అనంతరం కామారెడ్డి ఎస్పీ సింధు శర్మకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో నిజామాబాద్‌కు పూర్తిస్థాయి సీపీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. కాగా, సీపీ సాయిచైతన్య ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందినవారు. విధి నిర్వహణలో కఠినంగా ఉంటారనే ముద్ర ఉంది. రెండ్రోజుల్లో సీపీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఇన్నాళ్లు ఇన్‌చార్జి సీపీగా పనిచేసిన సింధుశర్మ బదిలీ అయ్యారు. ఆమెను ఇంటెలిజెన్స్ ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో యాదాద్రి భువనగిరి డీసీపీగా పనిచేస్తున్న ఎం.రాజేశ్‌చంద్రను కామారెడ్డి ఎస్పీగా నియమించింది.

నేతల ప్రమేయంతోనే లేటుగా..

జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతల మధ్య సమన్వయం కొరవడడంతోనే సీపీ నియామకంలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. ఇద్దరు నేతలు ఇరువురు పేర్లను ప్రతిపాదించినట్లు కాంగ్రెస్ వర్గాలలో చర్చకు దారితీసింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని సీపీని నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి డైరెక్ట్ ఐపీఎస్, స్ట్రిక్ట్ ఆఫీసర్ కావాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తుంది.

క్లుప్తంగా

టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు ఫలితాల విడుదల

నిజామాబాద్‌ అర్బన్‌: టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి నెలలో పరీక్షలు నిర్వహించగా, ఫలితాలను వెబ్‌సైట్‌ల్లో అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

పసుపు పరిశ్రమతో మహిళా సంఘాలకు ఉపాధి



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో ఏర్పాటైన పసుపు పరిశ్రమతో మహిళా సంఘాలు ఉపాధి పొందటానికి అవకాశం ఉందని కేపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘ డైరెక్టర్లు పాటుకూరి తిరుపతి రెడ్డి, పుప్పాల నగేశ్‌లు అన్నారు. శుక్రవారం గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్‌ను కలిసి పసుపు ఉత్పత్తులను పరిచయం చేశారు. జిల్లాలోని ఉన్న ఎస్‌హెచ్‌జీ సంఘాలు పసుపు ఉత్పత్తులను మార్కెటింగ్‌ చేస్తే లాభాలు పొందవచ్చని తెలిపారు. పసుపు పరిశ్రమతో ఒప్పందం చేసుకోవడానికి తాము అనుకూలంగా ఉన్నట్లు తిరుపతి రెడ్డి తెలిపారు. స్పందించిన డీఆర్‌డీవో... మనోహరాబాద్‌లో ఏర్పాటైన పసుపు పరిశ్రమ సందర్శనకు మహిళా సంఘాలను తీసుకొస్తామని, ఉపాధిని కల్పించే ఆలోచన చేస్తామన్నారు.

సబ్‌ కలెక్టర్‌ సుడిగాలి పర్యటన



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని పలు వార్డుల్లో సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో పర్యటించారు. శక్కర్‌నగర్‌ కాలనీలోని 22 వ వార్డులోని క్రీడా ప్రాంగణం, 23 వ వార్డులోని ఎన్‌ఎస్‌ఎఫ్‌ గ్రౌండ్‌, నర్సరీ, 1వ వార్డు ఆచన్‌పల్లి లోని యాద్రాద్రి ప్లాంటేషన్‌, ట్రీపార్క్‌, ఆటోనగర్‌లోని ట్రీ పార్క్‌తో పాటు 35 వార్డులోని శివాలయం వెళ్లే దారిలో కల్వర్టును, సాత్‌ పూల్‌ వద్ద పైప్‌లైన్‌ లీకేజీని పరిశీలించారు. 35వ వార్డులోని శివాలయం వెళ్లే దారిలో కూలిన కల్వర్టు నిర్మాణానికి త్వరితగతిన ప్రతిపాదనలు పంపాలని, పైప్‌లైన్‌ లీకేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డీఈ యోగేష్‌, ఏఈ శ్రీనివాస్‌లు ఉన్నారు.

అన్ని రంగాల్లోనూ ‘ఆమె’

ప్రస్తుత సమాజంలో ఆడవాళ్లు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. వ్యాపారం, క్రీడారంగం, యూనిఫాం ఉద్యోగాల్లో తమ సత్తా చాటుతున్నారు. అలాగే పలువురు స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణిస్తూనే మరింత మందికి ఉపాధి కల్పిస్తూ భరోసాను కల్పిస్తున్నారు. సామాజిక సేవలోనూ తమకంటూ గుర్తింపును తెచ్చుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు రంగాల్లో రాణించిన జిల్లా మహిళల విజయ గాథలు, మనోగతాలు, వారి సలహాలు, సూచనలు ఇలా..



స్వయంకృషితో రాణిస్తున్న సరిత



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని జర్నలిస్టు కాలనీకి చెందిన ఉప్పరి సరిత భారత మాత మహిళ సంఘం సభ్యురాలుగా చేరింది. ఇంట్లో చపాతీలు చేసి విక్రయిస్తు చిన్న వ్యాపారం మొదలుపెట్టింది. అలాగే అర్డర్‌పై వంటలు చేయడం ప్రారంభించింది. సంఘంలో పొదుపు నుంచి రూ. 10వేలు తీసుకొని వ్యాపారం మొదలుపెట్టింది. అలాగే సమాఖ్య నుంచి, బ్యాంకు లీకేజీ నుంచి, స్త్రీనిధి నుంచి రుణాలు పొంది, ప్రస్తుతం కర్రీపాయింట్‌ దుకాణాన్ని నిర్వహిస్తోంది. వ్యాపారం బాగా నడవడంతో వివిధ సంఘాల్లో తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తుంది. తెలిసిన వంట ద్వారానే ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కుటుంబంలో తనవంతు బాధ్యతను నెరవేరుస్తున్నారు.

ఆదర్శం.. కానిస్టేబుల్‌ కళ్యాణి



నిజామాబాద్‌ సిటీ: ఆర్మూర్‌ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన మగ్గిడి కళ్యాణి తండ్రి చిన్నతనంలోనే మరణించాడు. ఆమెకు తల్లితోపాటు ఇద్దరు అక్కలు ఉన్నారు. పేదరికం కారణంగా వారు మూడుపూటల తిండి తినడం కలగానే మిగిలిపోయింది. కానీ, కళ్యాణి ఎలాగైనా తమ పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకుంది. అది ప్రభుత్వ ఉద్యోగంతోనే సాధ్యమని నమ్మింది. దీంతో పట్టుదలతో చదివి తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్‌ ఉద్యోగానికి ఎంపికయ్యింది. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకొని హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తోంది. సర్కార్‌ కొలువు సాధించిన కళ్యాణి పలువురు మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది.

ఇష్టంతో పోలీస్‌ ఉద్యోగం సాధించిన రాధిక



రుద్రూర్‌: నవీపేట్‌ మండలం నాళేశ్వరం గ్రామానికి చెందిన తోట రాధిక తల్లిదండ్రుల సూచన మేరకు టీచర్‌ ట్రైనింగ్‌ (డీఎడ్‌) పూర్తి చేసింది. కానీ చిన్నప్పటి నుంచి ఆమెకు పోలీస్‌ ఉద్యోగం అంటే ఎంతో ఆసక్తి. దీంతో ఆమెకు పెళ్లయిన తర్వాత భర్తకు, కుటుంబసభ్యులకు పోలీస్‌ ఉద్యోగంపై ఉన్న ఆసక్తిని తెలియజేసింది. వారికి ఇద్దరు పిల్లలున్నా, పట్టుదలతో చదివి, హార్డ్‌ వర్క్‌ చేయడంతో పోలీస్‌ ఉద్యోగానికి సెలెక్టయింది. మూడు నెలల క్రితం తొలి పోస్టింగ్‌ రుద్రూర్‌ పోలీస్‌స్టేషన్‌లో వచ్చింది. పెళ్లయిన తర్వాత కూడా ప్రతి రంగంలో మహిళలు రాణిస్తారని నిరూపించింది రాధిక.

మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి..



నిజామాబాద్‌ నాగారం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికి శుభాకాంక్షలు. నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండడమే కాకుండా వారి వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి. అందులో భాగంగానే ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మహిళలందరూ రక్తహీనత, థైరాయిడ్‌, గుండె జబ్బులు, మధుమేహంతో పాటు క్యాన్సర్‌ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం ముందస్తు ఆరోగ్య పరీక్షల్ని చేసుకోవాలి.

– రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి

హక్కులు, అవకాశాల కోసం పాటుపడదాం



స్త్రీ హక్కులను, అవకాశాలను గుర్తిస్తూ, లింగ అసమానతను తొలగిస్తూ తోటి ఆడవారి అభివృద్ధి కోసం పాటుపడాలి. అడ్డంకులను అధిగమించి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి. అలాగే జిల్లాలో సంతానం లేక బాధపడుతున్నవారికి ఫెర్టిలిటీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

–అర్చన, ఫెర్టిలిటీ వైద్యురాలు, పినాకిల్‌ ఆస్పత్రి

మహిళాభ్యున్నతే ధ్యేయంగా ‘కపిల మహిళా సొసైటీ’





టైలరింగ్‌, ఎంబ్రాయిడరీ నేర్చుకుంటున్న మహిళలు.. టైలరింగ్‌ నేర్పుతున్న గోపిక

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: మహిళాభ్యున్నతే ధ్యేయంగా ఇందూరులోని కపిల మహిళా సొసైటీ గత 22 ఏళ్లుగా నిర్విరామంగా కృషి చేస్తోంది. ఈ సొసైటీ ద్వారా వేలాదిమంది మహిళలు వివిధ రకాల కోర్సులను నేర్చుకుని స్వయం ఉపాధితో నిలదొక్కుకుంటున్నారు. అయ్యవారు గోపిక అనే మహిళ 1991 నుంచి టైలరింగ్‌లో వేలమంది మహిళలకు శిక్షణ ఇస్తూ, 2003లో కపిల మహిళా సొసైటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ సొసైటీ సౌజన్యంతోపాటు నాబార్డ్‌, నెహ్రూ యువ కేంద్ర, ఖాదీ గ్రామోద్యోగ్‌ మహా విద్యాలయ, స్కిల్‌ ఇండియాలోని ప్రధానమంత్రి కౌశల్‌ వికాస్‌ యోజన, ఎంఎస్‌ఎంఈ తదితర పథకాల కింద శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్‌, ఎంబ్రాయిడరీ, జ్యూట్‌ బ్యాగుల తయారీ, హ్యాండీ క్రాఫ్ట్స్‌, క్రిస్టల్‌ క్రాఫ్ట్స్‌, చేతి కళలు, మగ్గం వర్క్స్‌, జ్యూట్‌ బ్యాగులపై పెయింటింగ్‌(స్క్రీన్‌ ప్రింటింగ్‌), పేపర్‌ బ్యాగులు, గ్లాసుల తయారీ, ఫుడ్‌ ప్రాసెసింగ్‌, రాఖీల తయారీ, బ్యాంగిల్స్‌ మేకింగ్‌, బ్యూటీషియన్‌ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తీసుకున్నవారందరికీ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. గోపిక సేవలకు గాను అనేక అవార్డులు వచ్చాయి. 2007, 2017లో గోపికకు ఉత్తమ సోషల్‌ వర్కర్‌ అవార్డులు వచ్చాయి. కాగా చిన్నతరహా రుణాలు, అక్షరాస్యత, మాతాశిశు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుండడంతో జిల్లాకు వచ్చిన కలెక్టర్లందరూ గోపికను ఆదర్శంగా చూపిస్తున్నారు.

నిరంతరం సాధన చేస్తే విజయం తథ్యం



ప్రతినిత్యం నచ్చిన క్రీడలో సాధన చేయాలి. కోచ్‌ల పర్యవేక్షణ, సలహాలు, సూచనలు పాటిస్తు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే నిర్దేశించిన లక్ష్యాల వైపు పరుగులు తీస్తారు. నేను ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాను. ప్రస్తుతం రైల్వేలో బిల్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే హాకీ భారత మహిళ సీనియర్‌ జట్టుకు కోచ్‌గా సైతం ఉన్నాను.

– యెండల సౌందర్య, హాకీ భారత మహిళా సీనియర్‌ జట్టు కోచ్‌

ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తా..



బాక్సింగ్‌ క్రీడలో జిల్లాకు, రాష్ట్రానికి ఎన్నో పతకాలు సాధించాను. జాతీయస్థాయిలో రాణించాను. ఒలింపిక్స్‌లో పతకం సాధించి తీరుతాను. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాను. త్వరలో వరల్డ్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు ఉన్నాయి. ఇందుకోసం సన్నద్ధం అవుతున్నాను.

– నిఖత్‌జరీన్‌, బాక్సింగ్‌ క్రీడాకారిణి

కబడ్డీలో రాణిస్తున్నా..



మా కుటుంబంలో నలుగురు అక్కాచెల్లెలం. నేను చదువుకుంటునే కబడ్డీ నేర్చుకున్నాను. ప్రతినిత్యం పీఈటీలు, కబడ్డీ కోచ్‌ సహకారంతో సాధన చేశాను. జిల్లా నుంచి జాతీయస్థాయికి ఎదిగాను. కబడ్డీలో రాణించడం వల్లే పోలీస్‌ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఎక్కడ సీనియర్‌ కబడ్డీ టోర్నమెంట్‌ ఉన్నా వెళ్లి రాణిస్తున్నాను.

– గోదావరి, జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారిణి

అంతర్జాతీయస్థాయిలో రాణించా..



చిన్నప్పటి నుంచే సాఫ్ట్‌బాల్‌ క్రీడపై మక్కువ పెంచుకున్నాను. కోచ్‌ గంగామోహన్‌ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. చైనా, తైవాన్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో రాణించాను. ప్రస్తుతం ఆర్మూర్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాను. క్రీడలో రాణిస్తూనే ఐపీఎస్‌ ఆఫీసర్‌ అవడమే లక్ష్యం.

– ఇందు, సాఫ్ట్‌బాల్‌ క్రీడాకారిణి

ఇష్టంతో కష్టపడాలి



ఏ క్రీడలో, చదువులో రాణించాలన్న ఇష్టంతో కష్టపడాలి. అప్పుడే మనం లక్ష్యాలను సాధించవచ్చు. నేను సాఫ్ట్‌బాల్‌ క్రీడను ఇష్టంతో కష్టపడ్డాను. కోచ్‌ సలహాలు పాటించి రెండు సార్లు అంతర్జాతీయస్థాయిలో రాణించాను. ప్రస్తుతం ఆర్మూర్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాను. ఐపీఎస్‌ ఆఫీసర్‌ అయి, ప్రజలకు సేవ చేస్తాను.

– రాణి, సాఫ్ట్‌బాల్‌ క్రీడాకారిణి

బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలు విస్తరించాలి

- ఎంపీ అర్వింద్‌
- నగరంలో టెలికాం అడ్వయిజరీ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్‌

నిజామాబాద్‌ రూరల్‌: గ్రామీణ ప్రాంతాలకు బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలను విస్తరించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌ స్పష్టం చేశారు. నగరంలోని బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టెలికాం అడ్వయిజరీ కమిటీ సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఇతర నెట్‌వర్క్‌ కన్నా బీఎస్‌ఎన్‌ఎల్‌ నెట్‌వర్క్‌ చాలా వేగవంతంగా ఉందని అన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌ను ఉపయోగిస్తున్న గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఇంట్లో బీఎస్‌ఎన్‌ఎల్‌ నెట్‌వర్క్‌ ఉపయోగించాలంటే 4జీ సేవలను మరింతగా వేగవంతం చేయాలన్నారు. టెలికాం సంస్థలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం వెంకటేశ్వర్లు, డిప్యూటీ జీఎం జగ్‌రాం, టెలికాం ఉద్యోగులు జగన్‌, రాజ్‌కుమార్‌, ఆరేపల్లి నర్సయ్య, బద్దం సాయిరెడ్డి, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

గోదావరి నదిలో మహిళ మృతదేహం లభ్యం



రెంజల్‌(బోధన్‌): మండలంలోని గోదావరి నదిలో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. నదిలో మహిళ మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని స్థానిక జాలర్లతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలు బోధన్‌కు చెందిన శంకరమ్మ (62)గా గుర్తించినట్లు తెలిసింది. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని సమాచారం. ప్రమాదవశాత్తు నదిలో పడి మృతిచెందినట్లు తెలుస్తోంది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నిజామాబాద్‌ రూరల్‌: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్‌ ఎస్సై–2 ఆనంద్‌ సాగర్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. రూరల్‌ మండలంలోని కాలూర్‌ గ్రామానికి చెందిన తాడెం గంగాధర్‌(44) గత నెల 25న అప్పుల బాధ భరించలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ : బాన్సువాడలో ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌ గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. సాయంత్రం కృష్ణానగర్‌ తండా వద్ద కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. ఈ విషయాన్ని బాన్సువాడలో ఉన్న తన మేనత్తకు ఫోన్‌ చేసి చెప్పాడు. దీంతో ఆమె అక్కడికి వెళ్లి వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం శ్రీకాంత్‌ పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు సమాచారం. శ్రీకాంత్‌ బాన్సువాడ ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈగా 2018 నుంచి పనిచేస్తున్నాడు. 2022లో షాద్‌నగర్‌కు బదిలీ అయినా.. అధికారులు డిప్యూటేషన్‌పై బాన్సువాడలోనే కొనసాగిస్తున్నారు. పని ఒత్తిడికి తోడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌ను ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ రాజేంద్రకుమార్‌ పరామర్శించారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌లోని జిరాయత్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న, ఆడుతున్న పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మొత్తం ఆరుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.13వేలు, 6ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాడుతున్న నలుగురు..

సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్సై రామ్‌ శుక్రవారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.5300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆర్మూర్‌టౌన్‌: మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన అల్లెపు వెంకవ్వ అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ శుక్రవారం తెలిపారు. ఈనెల 5న వెంకవ్వ భర్తతో కలిసి తన కూతురు గ్రామం జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్‌కు వెళ్లివస్తుండగా ఆర్మూర్‌ మండలం మామిడిపల్లి చౌరస్తా వద్ద ఆటోలో దిగింది. ఆ తర్వాత కనబడకుండపోయింది. ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో దొంగల బీభత్సం

- పలు ప్రాంతాల్లోని తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడిన దుండగులు
- బంగారం, నగదు అపహరణ



రాజంపేటలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

రాజంపేట: మండల కేంద్రంలోని తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేటకు చెందిన మాణిక్య రాజమణి ఇంటికి తాళం వేసి బుధవారం ఊరికి వెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం రాజమణి ఇంటి తలుపులు తెరచి ఉండటంతో వారి ఇంటిపక్కనే నివసిస్తున్న కిరణ్‌ కుమార్‌ వారికి సమాచారం అందించాడు. వెంటనే రాజమణి ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు ఇంట్లోని మూడున్నర తులాల బంగారు నెక్లెస్‌తో పాటు రూ. 10వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు.

నగరంలో ఆటో, బైక్‌..

ఖలీల్‌వాడి: నగరంలోని వేరువేరు చోట్ల రెండు వాహనాలు చోరీకి గురైనట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని గోదాంరోడ్డులో నిలిపేష్‌కుమార్‌ తన యాక్టీవాను ఇంటి ముందు పార్క్‌ చేయగా, గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అలాగే జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి పార్క్‌ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం ఆటో కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ రెండు చోరీ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నందిపేట మండలంలో..



సీసీ ఫుటేజీలో రికార్డయిన దుండగుడి దృశ్యం

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండలంలోని వెల్మల్‌ గ్రామంలో ఓ ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వెల్మల్‌ గ్రామానికి చెందిన కుస్తాపురం శ్రీనివాస్‌ తన భార్య, తండ్రితో కలిసి శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న తల్లి భోజమ్మ తలుపులకు గడియ పెట్టి ఖార్థానాకు వెళ్లింది. తిరిగి ఇంటికివచ్చి చూసేసరికి తలుపులు తెరిచిఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు తులాల బంగారు నగలు, వెండి సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించారు. ఈమేరకు బాధితుడు శ్రీనివాస్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

కుక్కల దాడిలో 10 గొర్రెల మృతి




కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌ గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామంలోని బాలమల్లేష్‌కు చెందిన గొర్లపాకలోకి గురువారం అర్ధరాత్రి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. ఈ దాడిలో 10 గొర్రెలు మృతి చెందగా, 20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం పాక వద్దకు వెళ్లిన బాలమల్లేష్‌ మృతిచెందిన గొర్రెలను గమనించి, పంచాయతీ, పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సుమారు రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాలమల్లేష్‌ ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని బాధితుడు ఆరోపించాడు.

జక్రాన్‌పల్లి మండలంలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌ గ్రామంలో బండారి నాగేష్‌కు చెందిన 16 గొర్రె, మేకలు కుక్కల దాడిలో మృతి చెందాయి. నాగేష్‌ కొట్టంలో ఉన్న గొర్రె, మేక పిల్లలపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. బాధితుడికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి



తుకారాం మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని పెద్ద గుజ్జుల్‌తండాకు చెందిన జరుపుల తుకారాం(40) తన బైక్‌పై గాంధారి నుంచి తండాకు బయలుదేరాడు. గాంధారి మండల పరిషత్‌ కార్యాలయం సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్‌ చేయబోయి ఎదురుగా వస్తున్న మద్దెల రవి బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో ఇద్దరు కిందపడిపోయారు. తుకారాం అక్కడికక్కడే మృతి చెందగా, రవికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలనికి చేరుకొని క్షతగాత్రున్ని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఒకరు..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి డివైడర్‌ను ఢీకొని మృతిచెందినట్లు స్థానికులు తెలపారు. వివరాలు ఇలా.. గాంధారికి చెందిన ఒడుసుల సాయిలు(38) గురువారం రాత్రి తన బైక్‌పై వెళ్తూ మండల కేంద్రంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొని కింద పడిపోయాడు. దీంతో బంధువులు అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులును సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం: ఒకరికి తీవ్ర గాయాలు

రెంజల్‌(బోధన్‌): మండలంలోని కళ్యాపూర్‌ వద్ద శుక్రవారం ఓ బైక్‌ను వెనుకనుంచి వచ్చిన డీసీఎం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. రెంజల్‌లో బీడీ కమీషన్‌ ఏజెంట్‌గా పని చేస్తున్న సత్యనారాయణ బీడీల గంపను బైక్‌పై పెట్టుకొని నవీపేట్‌లోని కంపెనీకి బయలుదేరాడు. మార్గమధ్యలో కళ్యాపూర్‌ గ్రామం వద్ద అతడి బైక్‌ను వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.